ప్రతాప వెంకట సుబ్బారాయుడు

కథ

# వృధార్త కథ



9393981918

మనిషి ఏ పని చేసినా అందులో వ్యర్థం ఉండకూడదని... వ్యర్థం చేయక పోవడం వల్ల మనకు నష్టం ఉండకపోగా, అది అవసరమైన వాళ్లకు చేరడంతో పుణ్యం వస్తుందని స్వామీ ఉపయోగానంద మైకట్టుకు చెప్పడం మన హనుమంతరావు మనసుకు పట్టేసింది.

ఆరోజు నుంచీ వేస్ట్ అనేది తను చేయకుండా తన చుట్టు పక్కల జరక్కుండా జాగ్రత్తగా చూసుకుంటున్నాడు.

ఆ ఆదివారం వాళ్లింటికి చిన్ననాటి స్నేహితుడు మురిపాలరావు-సతీ, ఏడేళ్ల పుత్ర సమేతంగా వాళ్లింటికి భోజనానికి వచ్చాడు.

భోజనం చేసే ముందే "అందరూ కావలసింది అడిగి మరీ తినండి, కాని వేస్ట్ చేయెుద్దు. మన దేశంలో తిండికి లేని వాళ్లు చాలా మంది ఉన్నారు"అన్నాడు.

"చెల్లెమ్మా, వీడు చాలా మారాడమ్మా, మొదట్లో వీడు తిన్నంత తిని మిగతాది పారేసేవాడు... అలాగే లేరా..మేమేం వేస్ట్ చేయం సరేనా?" అని తినడం మొదలెట్టారు.

అలా వాళ్లు తింటుంటే కంచం చుట్టూ మెతుకులు పడుతుంటే-

"అలా అన్నం కింద పడకూడదు, జాగ్రత్తగా తినండి, కింద పడినవి ఏరుకు తినండి"అన్నాడు.

వాళ్లు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"మనం పడేసింది, మనమే తీసుకు తినడానికి నామోషీ ఎందుకు?" అని వాళ్ల కంచాల చుట్టూ ఉన్న మెతుకులు ఏరుకుని తిన్నాడు.

అది చూసి వాళ్లకేం చేయాలో పాలుపోక 'ఇహ జీవితంలో వీడింటికి భోజనానికి రాకూడదు' అని మనసులో గాఢ్ఠిగా అనుకుని అతి కష్టంగా మునివేళ్లతో ఒక్క మెతుకు కింద పడకుండా తిన్నారు.

✦ ✦ ✦

ఒకరోజు హనుమంతరావు ఆఫీసునుంచి వస్తూ వాళ్లావిడ వీధి కుళాయి దగ్గర నీళ్లుపడుతుండడం చూశాడు.

పైప్ పక్కగా నీళ్లు లీకయి వృధాగా పోతుండడం చూసి... గబ గబా పైప్ దగ్గర కెళ్లి-"తాగడానికి గుక్కెడు నీళ్లు లేక ఎంతోమంది బాధ పడుతున్నారు. నీళ్లని ఇలా వృధా చెయ్యొచ్చా?" అని తన కర్చీఫ్ తీసి ఆ నీళ్ల దగ్గర పెట్టి దాన్ని భార్య బిందెలో పిండసాగాడు.

అది చూసి అతని భార్య నీలమణి వికారంగా ముఖం పెట్టి-

"ఏంటండీ..ఇది?!!" అంది.

అదేం పట్టించుకోకుండా కర్చీఫ్‌తో కూడా నీళ్లు వేస్ట్ అవుతుండడంతో వాళ్లావిడ కొంగు పట్టుకుని ఆ లీక్ కింద పెట్టాడు.

ఇహ ఆయన ఉండగా నీళ్లు పట్టుకోవడం కష్టమని విస విస బిందెతో ఇంటికెళ్లిపోయింది.

హనుమంతరావు పక్కావిడ కొంగు అందుకోబోయాడు.

ఆమె హతాశురాలై పరిగెత్తింది.

అదృష్టవశాత్తు నీళ్లు ఆగిపోవడంతో చేసేదేం లేక హనుమంతరావు ఇంటిదారి పట్టాడు.

ఓసారి హనుమంతరావు ఆఫీసుకు వెళుతుంటే ఆ కాలనీవాసి సదానందం రోడ్డు పక్కన చీమలకు చక్కెర పోసి వెళ్లిపోతూ కనిపించాడు.

"సాటి జీవాల పట్ల మీరు చూపుతున్న కరుణ గొప్పది. అయితే ఇలా వేసి అలా వెళ్లిపోకూడదు. ఎందుకంటే, అది గాలికి కొట్టుకుపోవచ్చు, లేదా మట్టిలో కలిసిపోవచ్చు. అంటే చక్కెర వృధా అవడమే కాకుండా, మీది వృధా ప్రయాస అవుతుందన్నమాట. చీమలు మీ అతిథులు వాటికి మీరు వేసిన చక్కెర పలుకులన్నీఅవి తినేదాకా ఉండి అప్పుడు వెళ్లండి" అన్నాడు.

దానికి ఆ వ్యక్తికి పిచ్చెక్కి వెనక్కి చూడకుండా



పరిగెత్తాడు.

హనుమంతరావు ఆఫీసుకి ఎగనామం పెట్టి చీమలు చక్కెర పూర్తిగా తమ పుట్టలకు చేరేసే దాకా అక్కడే ఉండి అప్పుడు సంతృప్తి పొందిన మనసుతో ఇంటి ముఖం పట్టాడు.

✦✦✦

ఇవాళ హనుమంతరావు అండ్ ఫ్యామ్లీ, మ్యారేజీకి వెళుతున్నారు. భర్త అక్కడ ఎలాంటి వింతలు ప్రదర్శిస్తాడో అని భయపడుతూనే అతని భార్య బయల్దేరింది.

పెళ్లి చూశాక విందు భోజనానికి వెళ్లారు.

హమ్మయ్యా, ఇంకా విందు మొదలవలేదు.

"అన్నం పరబ్రహ్మ స్వరూపం అని మీకు తెలుసు. ఒక్క పూట అన్నం లేకపోతే 'అన్నమో రామచంద్రా'అని అలమటించి పోతాం. అందుచేత దేన్నీ వృధా చేయొద్దు. 'భోజన కాలే హరినామ స్మరణే గోవిందా, గోవింద' అని గట్టిగా అరచి 'ఇహ ప్రారంభించండి" అన్నాడు.

అక్కడికొచ్చిన వాళ్లకి విషయం అర్థమయిా అవక పిచ్చచూపులు చూస్తూ అన్నం తిన సాగారు.

ఒకాయన భోజనం పూర్తవ్వంగానే ప్లేట్ను డస్ట్ బిన్‌లో వేయడానికి వెళుతుండగా హనుమంతరావు చూసి– "సార్..నేను పదార్థాలు వేస్ట్ చేయకూడదని చెప్పానా? లేదా? చూడండి. ప్లేట్ నిండా ఎన్ని ఉన్నాయో...అన్నీ వేస్ట్ అయిపోతాయి కదా! ఉండండి నేను ప్యాక్ చేసి ఇస్తా... ఇంటికి తీసుకుని వెళ్దురుగాని"అని పేపర్లో ప్యాక్ చేసి ఆయనకిచ్చాడు.

అంతేకాదు ప్లేట్స్ వేసే బిన్ దగ్గర నుంచుని, బిన్లో వేసే ప్లేట్లలో మిగులు పదార్థాలుంటే వాళ్లకి క్లాస్ పీకి అవి ప్యాక్ చేసి ఇస్తున్నాడు.

అలా భోజన కార్యక్రమం రసాభాస అవుతుండేసరికి పెళ్లి ఆపుకుని మరీ పెద్దలందరూ వచ్చి హనుమంతరావును బలవంతానా ఇంటికి పంపించేశారు.

✦✦✦

కొంతకాలానికి హనుమంతరావుకి ఆ పిచ్చి మరింత ముదిరి బయట కనిపించే ప్యాకింగ్ అన్ ర్యాప్ చేసిన పేపర్లు, థర్మాకోల్, సంచీలు, వాడి పడేసిన డబ్బాల్లాంటివి ఏరుకొచ్చి ఇంట్లో పెట్టడం మొదలెట్టాడు.

వాళ్లావిడ "మనం ఉండడానికే స్థలం లేదంటే ఈ చెత్తేంటండీ..ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచాలో కూడా తెలియడం లేదు. నలుగురూ వస్తే నవ్విపోతారు"అని వాపోతే...

"నీలమణీ!... ఇవన్నీ అనవసరమైనవని నువ్వనుకుంటున్నావ్..నాకిందులో మనుషుల అవసరాలు కనిపిస్తున్నాయి. రేపు పేపర్లో మనింట్లో ఇవున్నట్టుగా క్లాసిఫైడ్ వేయిస్తా, అవసరమైన వాళ్లు వచ్చి తీసుకుపోతారు. పరోపకారార్థం చేసే ఇలాంటి పనులు బోల్డంత పుణ్యాన్ని ఇస్తాయి"అన్నాడు అరమోడ్పు కళ్లతో.

✦✦✦

పేపర్లో ప్రకటన ఇచ్చి నెలైనా ఎవరూ వాళ్లింటి ముఖం చూడలేదు.

ఇంట్లో చెత్త ఎక్కువైపోయింది.

వాళ్లింటికి చుట్టుపక్కల వాళ్లు, చుట్టాళ్లూ ఎవరూ రావడం లేదు.



పైగా వాళ్లిల్లు ఓ చెత్తకుండీ అని, ఇంట్లోంచి వాసన కూడా వస్తోందని మునిసిపాలిటీలో కంప్లైంట్ చేశారు ఇరుగు పొరుగులు.

ఒకరోజు మునిసిపాలిటీ అధికారులు వచ్చి హనుమంతరావు కాళ్లా వేళ్లా పడుతున్నా మొత్తం ఇళ్లంతా ఉన్న చెత్తను లారీల్లోకెక్కించి తీసుకుని వెళ్లిపోయారు.

దాంతో హనుమంతరావు అంతా కోల్పోయినట్టు డీలా పడిపోయాడు.

ఈ లోకంలో లేకుండాపోయడు.


భర్త పరిస్థితికి నీలవేణి భయపడిపోయి ఆ ఊళ్లో బసచేసిన స్వామీ ఉపయోగానంద దగ్గరకెళ్లి తన భర్త పరిస్థితి మొరబెట్టుకుంది.

ఆయన 'తన మాటలు హనుమంతరావు మీద అంత ప్రభావం చూపాయా' అని ఆశ్చర్యపోయి, ఆమె వెంట వాళ్లింటికెళ్లాడు.

హనుమంతరావు పరిస్థితి ఆయనకి జాలి కలిగించింది.

అతని దగ్గరకెళ్లి–

"చూడు హనుమా, మమ్మల్ని పిలిచి గద్దె మీద కూర్చోబెట్టి పాలూ, పళ్లూ ఇస్తే ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి ఏదో ఒక విషయం తీసుకుని అనర్గళంగా మాట్లాడతాం. నువ్వు దాన్ని ఇలా సీరియస్ గా తీసుకుని పిచ్చివాడివవకూడదు. మేము పాపం, పుణ్యం విడమరచి ఎన్నో సార్లు ఎన్నో విషయాలు చెప్పాం, పుణ్య కార్యాలు చెయ్యమని బోధించాం. మీరు విన్నారా? వింటే ఇలా ఉంటుందా ప్రపంచం?




అందుచేత మేము చెప్పడం, మీరు విని వదిలెయ్యడం మమూలే. ఈ సృష్టిలో అనవసరమైనవనుకున్నవి ఎవరో ఒకరికి అవసరమైనవే! అలా అని ఆ బాధ్యత మనం తీసుకుంటామా? ఇల్లంతా చెత్త చేసుకుంటామా? మీరు పారేసే ఆహారం, నీరు మరో జీవరాశికి అవసరం. అది అలా వృధాతో జీవకోటికి అందడం ప్రకృతి నియమం. నువ్వు కేవలం మనుషుల్నే దృష్టిలో పెట్టుకుంటే ఎలా? మీకు వంట చెరకు అవసరం లేదు కానీ అది అడవిలోనూ, మారుమూలపల్లెల్లోనూ ఉండేవాళ్లకు అవసరం. అలా అని కట్టెపుల్లలు మనింట్లో పెట్టుకుంటామా? నువ్వు పూర్తిగా పిచ్చివాడివి కాకముందే నా మాటలు విని వాస్తవం తెలుసుకో.." అని నీలమణి ఇచ్చిన పాయసం కడుపునిండా తాగి భుక్తాయాసంతో వెళ్లిపోయాడు.

ఆయన మాటలతో ఈ లోకంలోకొచ్చిన హనుమంతరావు చెత్త(సేకరించే)పనులు మానుకుని మామూలు మనిషయ్యాడు.

భర్తను మామూలు మనిషిని చేసి, తనకు తిరిగిచ్చిన స్వామి ఉపయోగానందకి నీలమణి భక్తురాలైపోయింది.

దేవుడి పటాలదగ్గర ఆయన ఫోటో పెట్టి పూజలు, భజనలు చేస్తోంది.

ఇప్పుడు 'ఆయన' పిచ్చి నీలమణికి పట్టుకుంది.

హతవిధీ! హనుమంతరావు ఏం చేస్తాడో పాపం!

## సైలెంట్ స్మైల్

కామేష్

